# మా చిన్నపిల్ల



కీ. శే. పూడిపెద్ది వెంకటరమణయ్య

★

"నాన్నగారండీ! నాన్నగారండీ–" ఎక్కడ నుండోలాగు వినబడింది నాకా పిలుపు. అసలు దానిది పిల్లగొంతుక ఆ మీద నిద్రా కాదు, తెలివీ కాదు, కలా కాదు అదో అవస్థలో ఉంది నా చైతన్యం అప్పుడు.

ఉదయమంతా తిరగడంతోనే అయిపోయింది రెండుజాముల కింటికి వచ్చేను– ఆకలిమాటకేం– అడుగడుగునా కాఫీహోటళ్లే. అందరూ పళ్ళు బాకీ ఉన్నవాళ్ళే చిరుతిళ్ళకేం లోపం లేదు– బిల్లుకల్లకరయితే క్షణం ఈ సౌకర్యం బిల్లు లేకపోతే కల్లకరుకయినా దొరకదు. ఏదైనా ఇంటిపట్టున తిన్నతిండి సాటి అవుతుందా? ఆఖరీ అయిన ఈ రెండుమూడేళ్ళయాకూడా మకరం మధ్యాహ్నం కొండే కుంభం విస్తట్లో చూడలేదు.

ఎద్దు చచ్చిన దాసరిలాగనన్నీ వీధులు తిరిగి తిరిగి ఇంటికి వచ్చి ఒళ్ళు తోల్చుకొని, కండు మెతుకులు రుచీపచీ యెరుగకుండా నోట్లో వేసుకుని– పిల్లల గడబిడ లేకుండా ఉంటుంది గదా అని పెరటి చీడీమీద ఈ తిన్నంచం వాల్చుకుని తల క్రింద ప్రాతదిండొకటి పెట్టుకొని పడుకున్నాను. నిద్రలో కొంత అలసట మరచిపోదాం అని.

"నాన్నగారూ, నాన్నగారూ" అని మళ్లా వినబడ్డది– మా చిన్నపిల్లే ఆ పిలుపు. ఎనమండుగురు పిల్లలకీ ఒక్కలాటి చనువే గాని ఇది కొంచెం చురుకయిన ముండ వాళ్ళందరిలోకిని– నా వెంట బడి ఏవో కథలూ కబురులూ అలా చెబుతూ ఉంటుంది. దానికేక వినీ వినిపించుకోకుండా అలాగు కన్నులు మూసుకునే పడుకున్నాను. ఆ పిలుపు దగ్గరా వినబడింది. పెరటిగుమ్మంలో నిలబడ్డది మా చిన్నది. "చింతల్లీ! చిన్నదానా! చిన్నపిల్లా! చిన్నా! చిన్నీ అని అన్ని పేరులూ నరసగా నాలుకమీద దొర్లిపోతూ పిలిచేను– ఒళ్ళు చితుగకొట్టినట్టుంది– కన్నులు బరువెక్కినాయి– ప్రేమహృదయాన్ని ఆవేశించిన దయ్యం లాగు నా చేత ప్రేలిస్తూంది– అంతే ఆ పిలుపు నా సంతుష్టకేగాని ఆ పిల్ల నా దగ్గరకు రావాలనే కోర్కెతో కాదు.

'నాన్నగారూ! నాన్నగారూ' అని నా చెవి దగ్గర నిలిచి గట్టిగా పిలిచింది.

'అవతలకు పోయి ఆడుకో' అన్నాను.

"నాన్నగారూ మరే వచ్చి పెద్దక్క..."

నేను కన్నులు మూసుకునే "సరేలే! అవతల దాని నడుగుతాను వెళ్ళు" అన్నాను. నిద్రవేళ్ళే పడుతున్నాయినా అడుగులు. చిన్నతెరలాగు మమత క్రమ్ముతూంది.

"అది కాదండీ, నాన్నగారూ పెద్దక్క చెయ్యి నెత్తురండీ."

నేను త్రుళ్ళిపడ్డానుగాని సాధారణ చైతన్యంలోకి రావడాని కిష్టంలేక ఆ మాటలు పాటించేను కాను.

"పెద్దక్క వ్రేలు కోసుకుందండీ – ఎఱ్ఱగా వ్రేలంతా నెత్తురేనండీ– చూద్దురూ వచ్చి" తల పట్టుకొని కుదిపేసింది. నేను కన్నులు విప్పి భయం

గా చూస్తూ ఎక్కడ? ఎక్కడ? అని వెతి బోయేను.

“రండి! రండి” అంటూ నా చేయి పట్టుకుంది మా చిన్నది. ఆ రంకుముండ ముందుసావిట్లో ఉందండీ “తప్పు తిట్టకూడదం”టూ విడిపోతూన్న కచ్చి సవరించి కట్టుకుంటూ మా చిన్నదాని చేతిపట్టు విదిలించుకొని ముందు సావిట్లోకి మూడడుగులు వేసేను. “ఏమే కృష్ణవేణీ?” అంటూ.

కృష్ణవేణి తొమ్మిదేళ్ళది, వానా వానా చెల్లప్ప తిరుగుతూంది. నా ప్రశ్న విని తాపీగా త్రిప్పుకొని నిలబడ్డాది. ఏదీ వేశేదీ! అన్నాను.

ఇంతలో మా చిన్నది గబగబా వచ్చి చిన్న చేతులు రెండూ నా కళ్ళ కెదురుగా పెట్టి- అది కాదండీ సిరా పోసేసుకుంది చేతిమీద చూస్తున్నాను అన్న- కానీ యిచ్చి కొన్నారు కాదటండీ ఎఱ్ఱసిరా- అదీ! అంతాను బుడ్డి ఒంపేసింది. వెంకెముండ! కృష్ణవే చేతులు చూసేను. ఏమీ లేదు. సహజంగా దాని అరచేతులయందుండే లేతగులాబీ రంగు తప్ప ఆ చేతిలో నాకేమీ కనబడలేదు. నేను కృష్ణవేణీ- నీ చెయ్యి తెగిందా అన్నాను.

కృష్ణ: అబ్బే! నేను కూడ తరగలేదు నాన్నగారూ. అమ్మే తిరుక్కుంది. తరిగేను కొనని తిట్టింది. అమ్మ యెప్పుడూ పనిచెబుతూ ఉంటుంది నాన్నగారూ!

ఎఱ్ఱసిరా ఒంచేశావా బుడ్డిలోది?

“అమ్మ! అమ్మా! నేనా? నేనా? తమ్ముడండీ ఎండిపోయిన ఎఱ్ఱసిరా బుడ్డి తెచ్చి కడిగి దాల్లో నల్లసిరా పోసేసేడండీ- నిన్న నేను- నాకు సిరా ఎందుకూ మా అమ్మగారన్నీ పెన్సిలుతోనే రాయిస్తారు.

నాకు నిద్రమత్తు వదిలిపోయింది. అటునుంచిటు చూసేను. మా చిన్నది లేదక్కడ. గబగబా పారిపోయి గదిగుమ్మంలో నన్నవాళ్ళ తల్లి వీపుమీద బోరలా పడి ఆమె చెక్కిలిప్రక్కను ముఖం పెట్టి నవ్వుతూ నా వేపు చూస్తూంది నేను కోపంగా “చిందానా! ఇలారా!” అన్నాను.

“దానికి మీదేమిటి అ దాటు-కుఱ్ఱముండ ఏం చేసింది?” అంది మా యిల్లాలు.

ఆమెకు జబాబు చెప్పకుండా కోపంతో కలసిన నవ్వుముఖంతో మా చిన్నపిల్ల ముఖం చూసేను.

నా ప్రసన్నత చూచి నాకు కోపం లేదని గ్రహించి మా చిన్నది- జంకుజంకుగా వచ్చి తల్లికి చేరువగాను నాకు దూరంగానూ మా యిద్దరి




నడుమా నిలబడ్డాది. నోట్లో వ్రేలు పెట్టుకొని జాలిగా చూచింది.

‘చింతల్లీ ఇలారా నిన్నేమీ అనను.’ అలాగే జంకుతూ నా వేపు వస్తూంది. “ఏమీ లేంజే వెఱ్ఱి ముండా! ఎందుకిలా చేస్తావు! నిజమనుకొని గడగడలాడిపోయాను” అన్నాను.

అది కాదు నాన్నగారూ! అమ్మే వచ్చి-మరి ఇందాకిలా పొద్దున్న...”

మా యిల్లాలు! చాలులే! గుక్కెడు వేయి బెక్కులు! ఏం చేసిందండీ! ఇంత గడబిడ చేస్తున్నారూ!

ఏం చేసిందా? నేను నిద్రపోతూఉంటే వచ్చి నన్ను లేపేసి “అక్క వ్రేలు కోసుకుంద”ని చెప్పింది.

ఇల్లా: ఔనటే చిన్నా!

నేను: దాన్ని దగ్గడం ఎందుకూ నేను చెబుతూ ఉంటేను.

ఇల్లా: ఏమో! ఏం చూసి అనుకుందో! [illegible] ముండా, దానికేం తెలుసును చెప్పండీ? ఇప్పుడు మించిందేమిటి మళ్ళా వెళ్ళి పడుకోండి ఇంకా ఒంటిగంటే అయింది. మూడుగంటలదాకా వేళ ఉంది గదా! పడుకోండి హాయిగా!

నేను: నా పడక మాటకేం గాని-ఏమీ లేందే ఎందుకిలా చెప్పిందీ అని ఆలోచిస్తున్నాను. తరవాత అది ఎఱ్ఱసిరా పారపోసిందండి.

ఇల్లాలు: ఆఁ! అదుగో కారణముంది కాదూ అది అలా అనుకుందికి.

నేను. అదీ లేదూ, కృష్ణవేణి సిరా ముట్టుకోనే లేదు- దానిచేతులు చూడు- ఎంత శుభ్రంగా ఉన్నాయో, ఎఱ్ఱసిరా ఇవేళే కాదుగదా ఎప్పుడూ ముట్టుకోలేదంది పోనీ- దానివ్రేళ్ళను గోరింటైనా ఉంది గనకా ఏమీ లేందే దఆ ముండ ఇంత ఎలా కల్పించింది చెప్మా అనుకుంటున్నాను.

ఇల్లాలు: అదేమిటో! చిన్నపిల్లా అబద్ధం ఆడరంటారు గాని వాళ్ళూ ఆడుతారు.

నేను: అబద్ధం అంత తియ్యగా ఉంటుంది కాబోలు- దానికేం గాని చిన్నా, ఎఱుపుజాడేనా లేందే ఎదుకన్నావూ? వెఱ్ఱిముండా, నెత్తురెందుకన్నావూ-మరేమేనా అనకూడదూ! నా గుండె దడ ఇప్పటికింకా కట్టలేదు!

అది కాదు నాన్నగారూ! మరే వచ్చి అమ్మ ఇందాకలాను...

ఇల్లా: ఓసి దండుముండా ఈ నేరం నా మీదికి తోసేస్తావేమిటి!

నేను: ఉండే! దాన్ని చెప్పనియ్యి-చూడూ ఎలా ముడుచుకుపోయిందోను.

ఇల్లాలు: ఆఁ! భయంగల భల్లాడి!

నేను: ఉండూ- దాన్ని బెదరకొట్టక ఏదో చెప్పండూ- ఏమిటే చిన్నా? ఏమిటి అమ్మంటున్నావు.

చిన్న: అమ్మ అప్పుడు చాపలో కూర్చుని అరులు వేసుకుందండీ, చూడండీ దాని నోరూ!

ఓసి వెఱ్ఱిముండా అది చూచా ఇంత కథ.

---

ఆవంస శాణి *

# అల్యూమినమ్ పాత్రలు

ఈనాడు అల్యూమినమ్‌యొక్క ఉపయోగం అమూల్యముగా, అపారముగా ఉంటున్నది. తెల్లవారి లేచిందిలగాయితు పడుకోబోయేపర్యంతమూ, ఈ లోహమును ఏదో రూపేణా వాడుక చేస్తూనే వున్నాము. అగుట, ఇది విడనాడరాని వస్తువై ఉన్నది.

అంతేకాదు. దీని వాడుక ప్రపంచమంతటా విస్తృత వ్యాప్తిచెందుతూ, సర్వజనామోదాన్ని పొందుతున్నది.

అందుకనే, ఇప్పుడు బ్రిటన్‌లో శాస్త్రజ్ఞులు అల్యూమినమ్‌నుగురించిన గొప్ప పరిశోధనలు సల్పి, దాని వాడుకను మరింత హెచ్చించుటకు కృషి చేస్తున్నారు. ప్రత్యేకించి ఇటువంటి పరిశోధనలగురించి తన అనుభవాలు వ్రాస్తూ డాక్టర్ జె. ఎమ్. బ్రయాన్ అనే పరిశోధకుడు సమగ్రంగా గ్రంథస్తం చేసి వున్నాడు.

ఈ అల్యూమినమ్ పాత్రలు వాడితే అవి శరీరానికి వికటిస్తాయా, చెరుపు చేస్తాయా? అని చాలామందికి సందేహం బాధిస్తూ వున్నది.

దీనికి శాస్త్రజ్ఞులు, పరిశోధకులు చెప్పే ప్రత్యుత్తరం ఇది: 'అల్యూమినమ్ లోహంలో ఎటువంటి విషవస్తువులు కనిపియుండలేదు. దీని వాడుకవల్ల ఎట్టి రుగ్మతలూ కలుగవు. పైగా, అల్యూమినమ్‌పాత్రలలో భుజించుటవల్ల ఆహారపదార్థాల్లోని విటమిన్లు ఎంతమాత్రము సమసిపోవు.' — ఇట్లా అభియమిస్తున్నారు వారు.

ఇంకా యేమిటంటే: అల్యూమినమ్ వాడుక లాభకారి. చాలా తేలికగా వుంటుంది. కావలసిన స్వరూపాలు సుకరంగా తయారు చేసుకోవచ్చు. తుప్పుపట్టదు. వేడిని నిగ్రహిస్తుంది.

వాడుక అయిపోయినవెంటనే అల్యూమినమ్ పాత్రల్ని పొడిగా ఉంచడం మంచిది. నీళ్ళ చుక్కలు వాటిల్లో మిగిలివున్నట్టయితే డాగులు పడవచ్చు. తరుచు అల్యూమినమ్ పాత్రలపైన నల్లటి మచ్చలు ఏర్పడటంకద్దు. ఇవి ఎందుకు అట్లా ఏర్పడుతవి అనే సంగతి పరిశోధకుల దృష్టికి ఇంకా అందటంలేదు. కానైతే, వీటివల్ల ఏమీ హాని లేదనిన్నీ, వేడినీటికి కొంచెం 'వెనిగర్' కలిపి తోలిస్తే మరకలు పోతాయనీ శాస్త్రజ్ఞులు ఏకగ్రీవంగా చెబుతున్నారు.